# శ్రీ నివాస కల్యాణం

- యేలూరిపాటి ఆంజనేయశర్మ

ఇటీవల, అమెరికా అంతా తిరుపతి వేంకటేశ్వరుని కల్యాణాలతో పులకించి పోయింది. తిరుమల తిరుపతి దేవస్థానం వారు ధర్మప్రచారంలో భాగంగా దేశవిదేశాల్లో కల్యాణాలు నిర్వహిస్తూ ఇక్కడా నిర్వహించారు. భక్తులంతా కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరుని కల్యాణావలోకనంతో పులకితులయ్యారు. పరమానందభరితులయ్యారు. ఎంతోముందు రిజర్వు చేసుకొని, ఎన్నాళ్ళో ఎదురుచూసి, ఎన్నో వ్యయప్రయాసలకోర్చి తిరుమల చేరితే గాని లభించని కల్యాణోత్సవసేవ ఇక్కడే చేసే సౌభాగ్యం లభించటం అదృష్టం. ఇదంతా నిన్నటి దృశ్యం. నిన్నటి సంఘటన. నేటికి చరిత్ర. ఆ చరిత్ర చరణం నేటి అధ్యాయం.

ఈ అధ్యాయంలో ఉద్భవించిన అనేక ప్రశ్నలు- అనంతుడైన, అఖిలాండవ్యాపకుడైన పరమాత్మకు పెళ్ళేమిటి? మానవ నిర్మిత ప్రతిమ (బొమ్మ) లకు చేసే కల్యాణం, భగవత్కల్యాణమెలా అవుతుంది? అది లోక కల్యాణమంటే మరీ విడ్డూరం! ఇదీ ఓ రకంగా పిల్లలు చేసికొనే బొమ్మలపెళ్ళి వంటిదే కదా! దీనికి ఫలితం, ప్రయోజనం ఏమిటి?

నిజమే ఇది బొమ్మలపెళ్ళి వంటిదే. పిల్లలు చిన్నప్పుడు తాటాకు బొమ్మలుచేసి వాటికి పెళ్ళిళ్ళు చేసి కట్నాలపేరుతో పెద్దలవద్ద పావలాయో, బేడో గుంజి పప్పుబెల్లాలు కొని పెళ్ళి భోజనమంటూ పెద్దలచేతే తినిపించేవారు. వాళ్ళ ఆరిందాతనాన్ని, పెళ్ళివారికి చేసే మర్యాదల్నీ ముచ్చటగా, మురిపెంగా చూసుకునేవారు పెద్దలు. ఆవంకన వాళ్ళకి కథలూ, కార్యాల నిర్వహణ అబ్బేదనేది వేరే సంగతి.

వట్టిగా డబ్బియ్యి కొనుక్కుతింటానంటే ఎందుకంటూ గద్దించే పెద్దలు, వద్దన్నా డబ్బులు చేతిలో బెట్టి కొనుక్కోమంటారీ సందర్భంలో. పైగా "ఈపదిమందికీ పావలా ఏం సరిపోతుందీ? ఇంద ఈ రూపాయి ఉంచు ఈవాళ్ళికి" అంటూ అడిగినదానికంటే ఎక్కువే ఇస్తారు.

సరిగ్గా ఇదీ భగవంతుని పరిస్థితి. ఆయన ఇచ్చిన దాంట్లోంచే కొంత ఖర్చు పెట్టి, ఆయనకా పెళ్ళి చేసేంత పెద్దవాళ్ళలా మనం ఫీలవుతుంటే బహుశా ఆయన మురిపెంగా చూస్తూ, వెర్రినాగన్నా నువ్వు చేసే మంచిపనులకు అవేం సరిపోతాయి, ఇదిగో మరింత డబ్బు ఉంచు అంటూ ఇస్తాడు. ఇంతింత పనులకు నీ ఓపిక చాలదురా, ఇదిగో ఆరోగ్యం తీసికో, ఇంకా ఎన్నో చేయాలి, మరింత ఆయుస్సందుకో అంటూ ఆయురారోగ్యైశ్వర్యాలనిస్తాడు. ఎదురయ్యే ఆంటంకాలను తొలగించి విజయాన్నిస్తాడు. అంతశ్శత్రువులు, బహిశ్శత్రువులను నశింపజేస్తాడు.

బొమ్మల పెళ్ళిళ్ళు చేసి అలసిన 5 ఏళ్ళ కూతురికి గబగబ పెరుగన్నం తినిపించే తల్లి కనబడ్డంలేదూ!

దిష్టి తీస్తున్నట్లు అనిపించటంలేదూ!

ఆ తల్లీ పిల్లల అనుబంధమే భగవంతునికి-భక్తునికి బంధం.

మనం వెలిగించిన దీపమే మనకి దారి చూపించినట్లు, మనం చేసిన బొమ్మే మనకి వరాలిస్తుంది. విశ్వవ్యాపకుడైన పరమాత్మయొక్క అనంతశక్తిని క్రోడీకరింపచేసి, మంత్రం (శబ్దశక్తి) ద్వారా ఒకచోట కేంద్రీకరింపచేయటం ఆలయంలోని ధ్రువమూర్తి ఏర్పాటు. ఆ ధ్రువమూర్తి ప్రతిబింబం ఉత్సవమూర్తి. చతుర్మూర్తులుగా, పంచమూర్తులుగా వైఖానసాది ఆగమాల్లో చెప్పబడ్డ ధ్రువ-ఉత్సవ-బలి-స్నాన-కౌతుక బేరాల్లో ఉత్సవబేరం (ఉత్సవమూర్తులు) ద్వారా భగవంతుడు వివిధ ఉత్సవాల్లో భాగంగా అశక్తులైన ప్రజలవద్దకే వచ్చి వరాలివ్వటం జరుగుతుంది.

"ఉత్సూతే హర్షః" ఆనందం ఎక్కువగా ఉంటుంది కనుక అది ఉత్సవం. 'ఉత్' విశేషమైన 'సవః-యజ్ఞం' విశేషమైన దేవపూజ-ఉత్సవం అని అర్థం. కల్యాణం అంటే శుభం అని అర్థం. శుభాన్ని కలుగచేసే విశేషమైన దేవపూజ -కల్యాణోత్సవం.

మన బాస్ చికాకుగా ఉన్నప్పుడు అర్జీ పెట్టుకుంటే ఆపని అర్థాంతంగా ఆగిపోతుంది. అదే ఆనందంగా ఉన్నప్పుడు అభ్యర్థిస్తే ఆపని ఆసాంతం అద్భుతంగా పూర్తవుతుంది. అలాగే కల్యాణశోభలో తన దేవేరులను మురిపెంగా చూసుకుంటూ ముసిముసినవ్వులు నవ్వుతున్న సందర్భంలో కల్యాణ వేంకటేశ్వరుని కోరిన కోరిక వెంటనే తీరుతుంది.

నిజానికి ఆ సమయంలో ఆనందంగా ఉండేది మన అంతరంగమే. నిత్యానంద స్వరూపుడైన భగవంతునికి చికాకు-పరాకులుండవు. అవన్నీ మనవే. ఆనందమయ వాతావరణంలో ఆనందనిలయుడు ఆనందాన్నిస్తాడు.

ఆనందనిలయం మన శరీరం. ఆనందనిలయుడు అంతర్యామి. అంతర్యామి స్ఫూర్తితో సరి అయిన ఆలోచనలు కలిగి సరిగా ప్రవర్తిస్తూ సరి అయిన ఫలితాలను మనమే అందుకుంటాం.

శ్రీలక్ష్మి శ్రీనివాసమైనవాడు/ శ్రీనివాసముగా కలవాడు శ్రీనివాసుడు. లక్ష్మీ నారాయణులు వేరుకాదు. లోకమంతా వ్యాపించి ఉన్న శ్రీ నివాసుని కల్యాణం లోకకల్యాణమేకదా! అందులో పాల్గొన్న లోకులకు కల్యాణం-శుభం కాక మరేమిటి?

అంతా శుభమే.